క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా కమిటీలో మండలం నుంచి ఇద్దరు


నల్లజర్ల భవాని


మనోహరకుమార్

నల్లజర్ల: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) జిల్లా కమిటీలో నల్లజర్ల మండలం నుంచి ఇద్దరికి స్థానం లభించింది. కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. మండలంలోని తెలికిచెర్ల జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయిని నల్లజర్ల భవానీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న సీహెచ్ఎస్ ఎస్ మనోహరకుమార్ రెండో సారి జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. వీరిద్దరికి యూటీఎఫ్ నల్లజర్ల మండల శాఖ అభినందనలు తెలిపింది.

నేడు అండర్-17 బాలికల క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-17 బాలకల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల పీడీ ఓరుగంటి రామకృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యలో నిర్వహించే ఈ పోటీలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు జెడ్పీ హైస్కూళ్ల నుంచి క్రీడాకారిణులు హాజరవుతారని తెలిపారు.

అండర్-14 జిల్లా క్రికెట్ జట్టుకు రాజశేఖర్ ఎంపిక

చాగల్లు: బాలుర క్రికెట్ అండర్-14 ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు మండలంలోని మార్కొండపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ముప్పిడి రాజశేఖర్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఇటీవల తణుకు మండలం, తేతలి హైస్కూల్లో నిర్వహించిన బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలకు హాజరైన రాజశేఖర్ మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అతడు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


మల్లిపూడి ప్రసాద్ మృతదేహం

కొవ్వూరు: పట్టణ పరిధిలోని ఔరంగాబాద్‌లో మల్లిపూడి ప్రసాద్ (38) అనే వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన ప్రసాద్ ఐదేళ్లుగా ఔరంగాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. దుద్దుకూరులోని తమ ఇంటిపై ప్రసాద్ లోగడ రూ.5.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చలేకపోయానంటూ తరచూ బాధపడుతుండేవాడని మృతుడి భార్య కరుణ కుమారి పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఔరంగాబాద్‌లోనే ఉంటున్న తన తల్లిదండ్రుల ఇంటికి ఆదివారం రాత్రి కరుణకుమారి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని ఆదివారం రాత్రి ప్రసాద్ ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, వివాహం కాని ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

పెరవలి: జాతీయ రహదారిపై మండలంలోని నల్లాకులవారిపాలెం వద్ద సోమవారం తెల్లవారు జామున మతి స్థిమితం లేని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పెరవలి ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మతి స్థిమితం లేని ఆ మహిళ కొంతకాలంగా బిచ్చమెత్తుకుంటూ జీవిస్తోంది. ఈమె వయస్సు దాదాపు 55 ఏళ్లుంటాయి. తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఆమెను వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయిందని, ఎవరికైనా ఆమె వివరాలు తెలిస్తే పెరవలి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తరచూ సెల్ ఫోన్ చూస్తున్నాడని మందలించారని..

కొవ్వూరు: తరచూ సెల్ ఫోన్ చూస్తుండడంతో తల్లి సున్నితంగా మందలించింది. దాంతో మనస్థాపం చెందిన దొమ్మేరుకు చెందిన బైరెడ్డి దుర్గా ప్రసాద్ (15)అనే విద్యార్థి ఉరి వేసుకుని సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడు కొవ్వూరులో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి తాపీ పనికి, తల్లి పని నిమిత్తం కొవ్వూరు వెళ్లారు. చిన్న కుమారుడు చందు స్కూల్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడాన్ని గమనించిన దుర్గాప్రసాద్ వంట గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అతడి తల్లి లక్ష్మి కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొవ్వూరు నుంచి తాను ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యానుకు విగతజీవిగా వేళ్లాడుతున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేశారు.

సంక్షేమం జరగాలంటే జగన్ ఉండాల్సిందే

- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు
- పలు గ్రామాల్లో ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- సచివాలయాల వద్ద డిస్ ప్లే బోర్డుల ఆవిష్కరణ


దేవరపల్లి మండలం త్యాజంపూడిలో ఇంటింటికీ వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలో వివరిస్తున్న ఎంపీపీ దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

దేవరపల్లి: సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే కావాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. మండలంలోని త్యాజంపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించే డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ దుర్గారావు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ఎగురవేశారు. అనంతరం త్యాజంపూడి సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ మండల రైతు సంఘం అధ్యక్షుడు పల్లి వెంకటరత్న రెడ్డి స్వగృహం వద్ద పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. రాత్రి అక్కడే పల్లెనిద్ర చేశారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గోపాలపురం: అభివృద్ధి, సంక్షేమం అనేవి రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్న ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కరగపాడు సచివాయలం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, గ్రామస్తులకు చేకూరిన లబ్ధి వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎంపీపీ ఆ సచివాలయం పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే వల్లీ, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, సర్పంచ్ బొమ్మిన నాగలక్ష్మి, సర్పంచులు యండపల్లి శేఖర్‌బాబు, చిలకా లక్ష్మణస్వామి, కాకులపాటి శ్రీనువాస్, బొమ్మిన నాగరాజు పాల్గొన్నారు.

పెరవలి: సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని, అందుకే మరోసారి ఆయనను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని అన్నవరప్పాడు సచివాలయం వద్ద సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి జగన్ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్లు సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, సర్పంచ్ పంతం బాలసుందరి, సొసైటీ అధ్యక్షులు పంత నాగేశ్వరరావు, ఆ పార్టీ నాయకుడు పంతం సత్యనారాయణ (చిన్న) పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్ : గత నాలుగున్నరేళ్ల పాలనలో జగనన్న ప్రజలకు చేసిన మేలును చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు కోరారు. అట్లపాడు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆ పార్టీ శ్రేణులు నిర్వహించాయి. అట్లపాడు వాసులకు అందిన రూ.11.50 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.6.26 కోట్లతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ సీపీ స్తూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలోని సీనియర్ ఓటర్లను కలిసి రాష్ట్రానికి సీఎం జగన్ చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చేపట్టిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి పార్టీ ప్రధాన నాయకుల ఇళ్ల వద్ద వైఎస్సార్ సీపీ జెండాలను ఎగుర వేశారు. పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కోపల్లె అనంతలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ నాయకులు కొయ్యే నరేష్, మన్యం సూరిబాబు, మానుకొండ చంద్రబాబు, తిరుమళ్ల మునేశ్వరరావు, గారపాటి రాజు, బీరా సిన్హా, కోటయ్య, నాగళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ గలింకి మల్లిక అధ్యక్షతన జరిగింది. గ్రామంలో రూ.18 కోట్లతో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెల్లు హరిబాబు, గాలింకి రాంబాబు, ముప్పిడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు అందించిన రూ.41.21 కోట్ల సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మెయిన్ రోడ్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేశారు. వై ఏపీ నీడ్స్ బుక్ లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకుల ఇళ్ల వద్ద జెండాలను ఎగురవేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, సర్పంచ్ గురువెల్లి కుమారి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సింహాద్రి, వుండవల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జ్యోతి, జేసీఎస్ మండల కన్వీనర్ ఊబా దుర్గారావు, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురం మండలం కరగపాడులో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఇతర నాయకులు


అన్నవరప్పాడులో సంక్షేమ పథకాల సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్


నిడదవోలు మండలం అట్లపాడులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు


బ్రాహ్మణగూడెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న చాగల్లు ఎంపీపీ, నాయకులు

దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో కొనసాగుతున్న గడప గడపకూ..


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరం పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మపేట, బీసీ ఏరియాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసిఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు, సన్నచిన్నకారు రైతులు, కౌలుదారులు, చిరు వ్యాపారులు, డ్వాక్రా సంఘాల సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం నవరత్న పథకాలను అమలు చేస్తోందన్నారు. మోసపూరిత హామీలతో ఎన్నికల ముందు మీముందుకు వస్తున్న ప్రతిపక్షాల నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని శ్రీనివాస్‌నాయుడు ప్రజలను కోరారు.అన్ని వర్గాల ప్రజలకూ మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు, జిల్లా మహిళాసమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, మారిశెట్టి నాగేశ్వరరావు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, కారంపూడి రజనీకాంత్, బీఎస్సార్ యూత్ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

పేదల భూములకు శాశ్వత హక్కు పత్రాలు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- 400 మందికి హక్కు పట్టాల పంపిణీ


పేదలకు శాశ్వత భూహక్కు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ, ఈనాం, బండిదారి, అసైన్డ్ భూములపై వారికి ప్రభుత్వం పట్టాలు జారీ చేసి శాశ్వత యజమాన్య హక్కు కల్పిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన భూ సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు భూ యాజమాన్య శాశ్వత హక్కు పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ రికార్డుల్లో చుక్కల భూములకు శాశ్వత హక్కు కల్పించి చుక్కలను తొలగించిందన్నారు. మండలంలో 400 మందికి రూ.121 కోట్ల విలువైన 361 ఎకరాల భూములపై హక్కు పట్టాలు పంపిణీ చేశామన్నారు. 49 మంది లబ్ధిదారులకు రూ.11.04 కోట్ల విలువైన 24.55 ఎకరాల భూములపై కొత్తగా హక్కు పట్టాలు జారీ చేశామని చెప్పారు.

2003లో బందపురం, పల్లంట్ల గ్రామాల్లో 16 మంది లబ్ధిదారులకు అందజేసిన 14.88 ఎకరాలకు ఇప్పుడు హక్కు పట్టాలు అందజేశామన్నారు. లబ్ధిదారులు 20 ఏళ్ల అనంతరం క్రయవిక్రయాలు జరుపుకోవచ్చన్నారు. 334 మంది లబ్ధిదారులకు రూ.105.90 కోట్ల విలువైన 319 ఎకరాల ఈనాం భూములకు పట్టాలు అందజేసినట్టు ఎమ్మెల్యే తలారి చెప్పారు. పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఈ ఏడాది నుంచి రైతు భరోసా ఆర్థిక సాయం వర్తిస్తుందని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, రాష్ట్ర ఆయిల్‌పామ్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, గోపాలపురం ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించబోం


హాజరైన రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, సొసైటీల అధ్యక్షులు


సమావేశంలో మాట్లాడుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలుంటే చెప్పండి
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సొసైటీల అధ్యక్షులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు అవగాహన సమావేశం

పెరవలి: ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగితే అధికారులదే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, సొసైటీల అధ్యక్షులతో అవగాహన సమావేశం నిర్వహించారు. పెరవలిలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలా కాకుండా రైతులను ఇబ్బందులు పెడితే కఠినంగా వ్యవహరిస్తానన్నారు. ధాన్యం సేకరణకు నిడదవోలు నియోజకవర్గంలో 54 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా పెరవలి మండలంలో 18 వేల టన్నులు, నియోజకవర్గంలో 76 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ధాన్యం సేకరణకు వీలుగా గోనె సంచులను, రవాణాకు వీలుగా వాహనాలను ప్రభుత్వమే సమకూర్చిందని ఎమ్మెల్యే చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే సంచులు, తూకం మెషీన్లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఏవో మేరీ కిరణ్, 14 సొసైటీల అధ్యక్షులు, అన్ని గ్రామాల వ్యవసాయ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహేంద్ర కుటుంబానికి ఎంపీ భరత్ పరామర్శ


దొమ్మేరులో మహేంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న బొంత మహేంద్ర కుటుంబాన్ని ఎంపీ మార్గాని భరత్‌రామ్ సోమవారం పరామర్శించారు. మహేంద్ర చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అతని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. మహేంద్ర మృతికి దారితీసిన కారణాలను కుటుంబ సభ్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపీ హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, చాగల్లు ఎంపీపీ మట్టా వీరస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు గారపాటి వెంకటకృష్ణ, గారపాటి శ్రీనివాస్, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, పరిమి సోమరాజు, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల్లో కార్తిక పూజలు


నిడదవోలు గోలింగేశ్వ స్వామివారి గుడి వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నిడదవోలు రూరల్: కార్తిక మాసంలోని తొలి సోమవారం కావడంతో వేకువజాము నుంచే శైవ క్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మండలంలోని సమిశ్రగూడెంలోని శ్రీపర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి, కాటకోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి, కంసాలిపాలెంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసంలోని నాలుగు సోమవారాలూ కాటకోటేశ్వరంలోని శివాలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తారు. ఈ సోమవారం కరిబండి శ్రీరాములు, సాయిదుర్గ కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలు: పట్టణంలోని పురాతన రాజరాజేశ్వరీ సమేత గోలింగేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వార్ల ఆలయాల్లో భక్తులు నిత్యాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారికి అభిషేకాలు చేశారు. సోమేశ్వరస్వామి ఆలయంలో రిటైర్డు తెలుగు పండితుడు పొన్నా కృష్ణబాబు చెబుతున్న శివ పురాణం భక్తులను ఆకట్టుకుంటోంది. వేద పండితుల మంత్రాల నడుమ భక్తులు ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ నిర్వహించారు. పాలంగిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోను మోర్త శివాలయంలోను ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. మహిళలు గుడి ధ్వజ స్తంభం వద్ద దీపారాధనలు చేశారు. శివాలయంలోని ఉసిరి చెట్టుకు వారు పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

గోష్పాద క్షేత్రానికి కార్తిక శోభ

కొవ్వూరు: కార్తికమాసంలోని తొలి సోమవారం కావడంతో గోష్పాద క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్థానికులే కాకుండా పరిసర మండలాల నుంచి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు.క్షే దాంతో క్షేత్రంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ ఏర్పడింది. భక్తజనంతో గోష్పాద క్షేత్రంలోని ఆలయాలు సందడిగా మారాయి. వేలాది మహిళలు నదిలో పుణ్య స్నానాలు ఆచరించి నది ఒడ్డునే దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం నదిలో అరటి దిన్నెలపై కార్తిక దీపాలు విడిచి పెట్టారు. ఈ క్షేత్రంలోని సుందరేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం

- ఇది సీఎం జగన్ చలవే
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రోత్సాహంతో రాష్ట్రంలోని గ్రంథాలయాలు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆలపాటి సురేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వసతుల లేమితో కునారిల్లుతున్న గ్రంథాలయాలు గత నాలుగున్నరేళ్లుగా అభివృద్ధి బాట పట్టాయన్నారు. ఇదే గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ప్రభుత్వోద్యోగాలు సాధించిన అనేక మంది జీవితాలు గ్రంథాలయాల గొప్పతనానికి నిదర్శనమన్నారు. వివిధ పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, సర్పంచులు పల్లి జ్యోతి, అల్లూరి సూర్యచంద్రరావు, ఈఓపీఆర్డీ సింహాద్రి, ఎంఈఓ వై.సత్యనారాయణ, గ్రంథపాలకురాలు ఏవీ రమణ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని పెరవలి, తీపర్రు, ముక్కామల గ్రంథాలయాల్లో నిర్వహించిన వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాల్లో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ముక్కామలలో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, తీపర్రు కార్యక్రమానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముక్కామల కార్యక్రమాల్లో ఎంపీడీవో రమేష్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు రామాంజని సత్కరిచారు.ఎంఈఓ బొబ్బిలి స్వరూప్, పెరవలి, ముక్కామల, తీపర్రు సర్పంచులు గంగోలు సీతమ్మ, కేతా త్రిమూర్తులు, కోటిపల్లి శ్రీదేవి, ముక్కామల మాజీ సర్పంచ్ అరిగెల అరుణకుమారి, లైబ్రేరియన్లు ఎం.వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్, డాక్టర్ జె.చంద్రప్రసాద్, డాక్టర్ సుంకవల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.


నల్లజర్లలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


ముక్కామలలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలు


ఉండ్రాజవరంలో విజేతలకు బహుమతులు ఇస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు

జగన్ మరోసారి గెలవాలంటూ..

టెక్కలి నుంచి తిరుమలకు పాదయాత్ర



టెక్కలి నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న గుర్‌నాథ్ యాదవ్ తదితరులు

దేవరపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి తిరుమలకు యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గురునాథ్ యాదవ్ పాదయాత్ర చేపట్టారు. ఆయన పాదయాత్ర సోమవారం సాయంత్రం దేవరపల్లి చేరుకుంది. గురునాథ్ యాదవ్‌కు వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు దుగ్గిన గంగాధర్, కడిమి రాజు, కవల శ్రీనివాస్, మాధవరపు వెంకటేశ్వరరావు, గుంటుపల్లి శ్రీను, మడాల సూరిబాబు, తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురునాథ్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 8న టెక్కలిలో మొదలైన పాదయాత్ర డిసెంబర్ 10కి తిరుమల చేరుకుంటుందన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

దేవరపల్లి: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కోరారు. మండల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు సోమవారం దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 11వ పీఆర్సీలో అడిషనల్ క్వాంటాన్ని 10 నుంచి 7 శాతానికి, 15 నుంచి 12 శాతానికి తగ్గించారని వారు వివరించారు. దీనిని పునరాలోచన చేసి పాత పద్ధతిలో ఇప్పించాలని కోరారు. 11వ పీఆర్సీ, డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యామిలీ పెన్షన్ రేటును 50 శాతం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యేను కలసిని వారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు, మండల శాఖ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య, అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఆలీ సాహెబ్ ఉన్నారు.